'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

# జాతీయ పార్టీల పాపమిది

వృక్షో రక్షతి రక్షితః అనేది కేవలం ఆచరణలోకి రాని అందమైన సూక్తిగానే మిగిలిపోతున్నది. ప్రపంచవ్యాప్తంగా నానాటికీ పచ్చదనం హరించుకుపోతున్నది. కాపాడే నాథుడు లేక అశేష జంతుజాలం అవతారం చాలిస్తున్నది. మన దేశంలోనూ పరిస్థితులు మరీ దారుణంగా తయారయ్యాయి. ప్రకృతి పరిరక్షణ సూచీలో (ఎన్‌సీఐ) భారత్ అట్టడుగున పడిపోవడమే ఇందుకు తాజా ఉదాహరణ. వందకు 45.5 స్కోరుతో 180 దేశాల జాబితాలో, 176వ ర్యాంకు వద్ద చిట్టచివరి ఐదు దేశాల్లో భారత్ 'అగ్రస్థానంలో' నిలిచింది. మానవ జీవనానికి అవసరమయ్యే సర్వస్వాన్ని సమకూర్చే ప్రకృతిని కాపాడే విషయంలో ప్రపంచ దేశాల తీరుతెన్నులను తెలిపే ఈ సూచీని ఈ ఏడాదే ప్రవేశపెట్టారు. నెగేవ్‌లోని బెన్‌గురియన్ యూనివర్సిటీ, బయోడీబీ డాట్‌కామ్ అనే స్వచ్ఛంద సంస్థ ఈ సూచీని తయారుచేశాయి. తొలి జాబితాలోనే భారత్‌కు ఇబ్బందికరమైన ర్యాంకు రావడం గమనార్హం. ఇది బాధాకరమే అయినప్పటికీ కాదనలేని వాస్తవం.

జీవవైవిధ్య పరిరక్షణలో, సుస్థిర భూ నిర్వహణలో భారత్ వైఫల్యమే కనిష్ఠ ర్యాంకుకు కారణమని సూచీ రూపకర్తలు అభిప్రాయపడ్డారు. తరిగిపోతున్న తరుసంపదే అందుకు సాక్ష్యం. భారత్‌లో 53 శాతం భూమిని సహజ స్థితిలో కాపాడకుండా పారిశ్రామికీకరణ, పట్టణీకరణ, వ్యవసాయాభివృద్ధి వంటి వేరే అవసరాలకు మళ్లించడం జరిగింది. 2001-2019 మధ్యకాలంలో 23,300 చదరపు కిలోమీటర్ల పచ్చని అడవి అంతర్ధానమైపోయింది. 67 శాతం జలచర, 47 శాతం భూచర జాతుల సంఖ్య అంతకంతకూ తగ్గిపోతున్నది. 100 స్కేలుపై భారత్ 54 వద్ద ఆగిపోయింది. దశాబ్దాలుగా దేశాన్ని పాలించిన జాతీయ పార్టీలు దీనికి జవాబు చెప్పాలి. కాంగ్రెస్ హయాంలో మొదలైన అడవుల విధ్వంసం బీజేపీ హయాంలో నిరాఘాటంగా కొనసాగిం ది. ఖనిజాల కోసం వనాలను కార్పొరేట్ కం పెనీలకు ధారాదత్తం చేసే అటవీ సవరణ చట్టాన్ని తెచ్చిన ఘనత కేంద్రంలోని ఎన్డీయే సర్కారుదే. అటవీ ఉత్పత్తుల అక్రమ వ్యాపారంలో ప్రపంచంలో భారత్ నాలుగో స్థానంలో ఉండటాన్ని గమనిస్తే చాలు మన పర్యావరణ పరిరక్షణ ఏ స్థాయిలో ఉన్నదో అర్థమవుతుంది.

ఉన్న అడవులను కాపాడుకోవడం ఒక ఎత్తయితే, అడవిని కొత్తగా సృష్టించడం మరో ఎత్తు. దాదాపు అసాధ్యం లాంటి ఈ అద్భుతాన్ని తెలంగాణలో సుసాధ్యం చేసిన వ్యక్తి కేసీఆర్. ప్రత్యేక రాష్ట్రంలో పచ్చదనం పరిరక్షణకు ఆయన చేపట్టిన చర్యలు దేశానికే ఆదర్శంగా నిలిచాయి. పెదవులపై మాటలు చెప్పకుండా వ్యూహాత్మకంగా, ఆచరణాత్మకంగా ముందుకు సాగడం వల్లే అది సాధ్యమైంది. స్వరాష్ట్ర పగ్గాలు అందుకున్న వెంటనే నానాటికీ తీసికట్టు అవుతున్న అడవుల విస్తీర్ణాన్ని పెంచేందుకు ఆయన నడుం బిగించారు. తెలంగాణకు హరితహారం పేరుతో ఆయన చేపట్టిన మొక్కలు నాటే ఉద్యమం ఉధృతంగా సాగింది. 2015 నుంచి 2023 వరకు ఎనిమిది విడతల్లో రూ.10,822 కోట్ల వ్యయంతో 273 కోట్ల మొక్కలను కేసీఆర్ ప్రభుత్వం నాటించింది. అవార్డులు, రివార్డులు పొందిన ఈ అపూర్వ కార్యక్రమం ఫలితంగా రాష్ట్రంలో అటవీ పరిమాణం 7.7 శాతం పెరిగిందని స్వయంగా కేంద్ర ప్రభుత్వమే ప్రకటించి ప్రశంసించడం తెలిసిందే. పల్లె వనాలు, పట్టణ వనాలు పెంచడం మరింతగా హరితాన్ని విస్తరింపజేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత హరితహారం లక్ష్యాలను నీరుగార్చే ప్రయత్నాలు సాగుతున్నాయి. కేసీఆర్ విధానాలను తిరగదోడటమే లక్ష్యంగా పనిచేయడం ఇందుకు కారణం. రాడార్ నిర్మాణం పేరిట దామగుండం అడవుల విధ్వంసాన్ని స్వాగతించిన కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి ఇంతకన్నా ఎక్కువ ఆశించలేం. ఆ సంగతి అలా ఉంచితే భూతాపం పెరిగి మానవాళి మనుగడకే ముప్పు ఎదురవుతున్న వేళ అత్యధిక జనాభా కలిగిన దేశంగా కాలుష్య దుష్పరిణామాలకు అత్యధికంగా గురయ్యే భారత్ వంటి పెద్ద దేశం బాధ్యతారహితంగా ఉండజాలదు. పరిస్థితి మరింతగా చెయ్యిదాటి పోకముందే దిద్దుబాటు చర్యలు చేపట్టాలి. భూమాతకు జరుగుతున్న అపచారాన్ని అరికట్టేందుకు పచ్చని ఆకు సాక్షిగా ఉద్యమించాలి.

# గూడు చెదిరింది.. గుండె పగిలింది!

**మూసీ ప్రక్షాళన పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన చర్యలు ఆ నది ఒడ్డున నివసిస్తున్న వేల మంది బడుగు జీవుల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నవి. గత్యంతరం లేని అట్టడుగువర్గాల ప్రజలు, ఇండ్లలో పాచి పనులు, చిత్తు కాగితాలు ఏరుకునేవాళ్లు, పూలమ్ముకునేవారు, పారిశుద్ధ్య కార్మికులు, వీధి వ్యాపారులు తదితరులు ఎక్కువగా మూసీ ఒడ్డున నివసిస్తున్నారు. అత్యంత అపరిశుభ్రమైన, దుర్గంధభరితమైన పరిసరాల్లో వారు ఉంటున్నారు. పైసా పైసా కూడబెట్టుకున్న తమ కష్టార్జితంతో చిన్నపాటి స్థలాన్ని కొనుగోలు చేసి అందులో రేకుల షెడ్డు నిర్మించుకుని గత 30-40 ఏండ్లుగా అక్కడే బతుకుతున్నారు. ప్రభుత్వానికి అన్నిరకాల పన్నులు కడుతున్నప్పటికీ, కనీస మౌలిక వసతులకు కూడా నోచుకోని నిరుపేదల గూళ్లను రాత్రికిరాత్రే కూల్చివేయడం బాధాకరం.**



జి.అనసూయ
94901 28259



ఒకప్పటి తాగునీటి వనరైన మూసీ నది కాలుష్య కాసారంగా మారడానికి ఉమ్మడి ప్రభుత్వాల నిర్లక్ష్యమే కారణం. ఇండ్లు, పరిశ్రమలు, ఆసుపత్రుల నుంచి విడుదలయ్యే వ్యర్థాలు, రసాయనాలు యథేచ్ఛగా మూసీలో కలుస్తున్నా నాటి పాలకులు పట్టించుకోలేదు. అందుకే మూసీ మురికికూపంగా మారింది. వికారాబాద్ జిల్లా అనంతగిరి కొండల్లోంచి మూసీ, దామగుండం అడవుల్లో నుంచి ఈసా, కొండకోనల్లో నుంచి పారే చిన్నచిన్న వాగులు, వంకలు ఏకమై మూసీ నదిగా రూపాంతరం చెందాయి. హైదరాబాద్‌లో మురికికూపంలా కనిపించే మూసీ నది రంగారెడ్డి, ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నది. 240 కిలోమీటర్లు ప్రయాణించే ఈ నది నల్లగొండ జిల్లాలోని వాడపల్లిలో కృష్ణా నదిలో కలుస్తుంది.

మూసీ నీటితో పండించే కూరగాయలు, పండ్లు, ఆహారధాన్యాలు కూడా విషపూరిత రసాయనాలను కలిగి ఉన్నట్టు శాస్త్రవేత్తలు చెప్పండటం ఆందోళనకరం. ప్రజల సంక్షేమం, ఆరోగ్యం పట్ల ప్రభుత్వానికి శ్రద్ధ, చిత్తశుద్ధి ఉంటే కాలుష్యానికి కారణమవుతున్న డ్రైన్లు, పారిశ్రామిక రసాయనాలు, జీవ వ్యర్థాలు మూసీలో కలవకుండా కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. నాలుగు దశాబ్దాల నుంచి మూసీ ఒడ్డున నివసిస్తున్న నిరుపేద కుటుంబాలకు ప్రత్యామ్నాయ నివాసాలను ఏర్పాటు చేయవచ్చు. కానీ, రాష్ట్ర ప్రభుత్వం అలా చేయడం లేదు. మలక్‌పేట నుంచి హయత్‌నగర్ వరకు నిజాం కాలంలో గడ్డి పెంచుకోవటానికి గొల్లలకు ఇచ్చిన గడ్డి భూములను కబ్జా చేసి లేఔట్లుగా మార్చి రియల్ ఎస్టేట్ మాఫియా సొమ్ము చేసుకున్నది. పేద ప్రజల ఓట్ల కోసం 'మేమున్నాం.. మీకేం కాదు, ఇల్లు కట్టుకోండి' అంటూ రాజకీయ నాయకులు వారికి భరోసా ఇచ్చారు. దాంతో రెక్కలు ముక్కలు చేసుకొని సంపాదించిన సొమ్ముతో పాటు ఊర్లలో ఉన్న అరెకరం, ఎకరం అమ్ముకొని, అప్పోసొప్పో చేసి చాలా మంది నిరుపేదలు స్థలాలు కొని దశాబ్దాల క్రితం మూసీ ఒడ్డున ఇండ్లు కట్టుకున్నారు. ఇప్పుడు సుందరీకరణ పేరిట వారి గూడు చెదరగొట్టి, రెక్కలు విరగొట్టి, తరిమికొడితే వారి గుండె పగలదా? ప్రజా సంఘాల నిజనిర్ధారణ బృందానికి ఎదురైన కన్నీటి గాథలివీ.

మనిషి ఆశాజీవి. కొందరు ఉన్న 53, 83 గజాల స్థలంలోనే లక్షలు ఖర్చు చేసి 2, 3 అంతస్తులు కట్టుకున్నారు. ఇద్దరు ముగ్గురు అన్నదమ్ములు ఒక్క ఇంట్లోనే వేర్వేరు పోర్షన్లలో ఉంటున్నవాళ్లు కూడా ఉన్నారు. వాళ్లెవరూ తమ ఇళ్లను వదిలి పోవడానికి సిద్ధంగా లేరు. ఎలాంటి సంప్రదింపులు, ముందస్తు నోటీసులు లేకుండా, ప్రజాభిప్రాయం తెలుసుకోకుండా ఇండ్లను కూల్చడం నియంతృత్వం కాదా? 'మేం కూల్చి తీరుతాం, మూసీ ప్రక్షాళన చేసి తీరుతా'మంటూ పాలకులు ప్రకటనలు చేయడం.. ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం కాదా? ఐదేండ్లు గ్యారెంటీ లేని తమకే అంత అహంకారముంటే ప్రభుత్వాలను మార్చే శక్తి ఉన్న ప్రజలకి ఎంత ధైర్యం ఉండాలి? ప్రభుత్వాలు మారుతుంటాయి, ప్రజలు మాత్రమే శాశ్వతం. ప్రజల ఉసురుపోసుకున్న ప్రభుత్వాలకు పుట్టగతులు ఉండవన్న తెలివి పాలకవర్గాలకు ఉండాలి.

అసలు మూసీ ప్రక్షాళన చేయాల్సిన తీరు ఇది కాదు. మూసీ సుందరీకరణకు ముందే తొలుత ప్రభుత్వం చేయాల్సిన పనులు తక్షణ కర్తవ్యాలు కొన్ని ఉన్నాయి. ఆర్‌బీ-ఎక్స్, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లు అంటూ మార్క్ చేసిన ఇళ్లకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఆయా బస్తీలు, కాలనీల్లో ముందుగా ప్రకటించాలి. ఇళ్లను కూల్చి, మూసీ ప్రక్షాళన చేసిన తర్వాత ఆ స్థలాలను ఏం చేస్తారన్న ప్రణాళిక, డీపీఆర్‌లను ప్రజల ముందుంచాలి. ఇది కదా ప్రభుత్వం మొదటగా చేయాల్సింది.

**మూసీ ఒడ్డున ఉన్న తాత్కాలిక నివాసాలు, పక్కా ఇండ్లు, పట్టాదారులు, కిరాయిదారులను వివిధ క్యాటగిరీలుగా విభజించి న్యాయబద్ధంగా, చట్టబద్ధంగా చర్యలు తీసుకోవాలి. నగరం నడిబొడ్డున సొంత ఇళ్లను కోల్పోతున్న బాధితులకు ఏ రకమైన న్యాయం చేయనున్నారు? వాళ్లకు అదే ప్రాంతంలో ఇంటి స్థలాలను కేటాయిస్తారా? లేదా కేటాయించని పక్షంలో ప్రభుత్వానికి ఉన్న అభ్యంతరాలు ఏమిటి? అన్నది స్పష్టం చేయాలి.**

చెరువులు, కుంటలను కబళించి వ్యాపార, విద్యా కేంద్రాలు, విల్లాలు నిర్మిస్తున్న బడాబాబుల కట్టడాలకు, పేదల ఇళ్లకు అసలు పోలికే లేదు. తమ దృష్టిలో అందరూ సమానమేనని ప్రభుత్వం చెప్తుండటం ఒక బూటకం. ఈ విషయం పాలకులతో పాటు ప్రజలకు కూడా బాగా తెలుసు. రాజ్యాంగబద్ధమైన నివాస హక్కు, జీవించే హక్కులకు భంగం కలగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్న విషయాన్ని ఈ సందర్భంగా పాలకులు గుర్తుంచుకోవాలి. 1946 డిసెంబర్ 3న భారత రాజ్యాంగ పరిషత్తులో లక్ష్యాల తీర్మానం ప్రవేశపెడుతూ దేశ ప్రజలందరికీ కూడు, గూడు, గుడ్డ అందించడమే రాజ్యాంగ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న విషయం విదితమే. అయితే, ఆ మాటలు నేటికీ అమలుకు, ఆచరణకు నోచుకోకపోవడం విచారకరం.

(వ్యాసకర్త: పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షులు)



# గుస్సాడీ నృత్య 'కనక'ం

**నటరాజు స్వరూపమైన గుస్సాడీ నృత్యం ఆగిపోయింది. ఆదివాసీ సంస్కృతికి ప్రతీకగా నిలిచే నృత్యరూపకానికి వన్నెతెచ్చిన గజ్జెల సవ్వడు నిలిచిపోయింది. అంతరించి పోయే దశకు చేరుకున్న గుస్సాడీ నృత్యాన్ని దశాబ్దాలుగా పరిరక్షిస్తున్న పద్మశ్రీ కనకరాజు పరమపదించి ఆదివాసీ కళాలోకాన్ని శోకసంద్రంలో ముంచారు.**

గిరిజనుల దేవనాట్యంగా ప్రసిద్ధిచెందిన గుస్సాడీ నృత్య పరిరక్షణకు కనకరాజు ఎంతగానో కృషిచేశారు. అంతరించిపోయే దశకు చేరుకున్న ఈ నృత్యాన్ని బతికించుకునేందుకు నాలుగు దశాబ్దాల కిందటే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన పలువురు గోండు పెద్దలు నడుం బిగించారు. అదే జిల్లాలోని ఉట్నూర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి కీ.శే. మడావి తుకారాం.. గోండు యువకులకు గుస్సాడీ నృత్యాన్ని నేర్పించేందుకు కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా పిట్టగూడలో శిక్షణ తరగతులు నిర్వహించారు. నాడు యువకులకు శిక్షణ ఇచ్చినవారిలో కనకరాజు ప్రముఖులు కావడం విశేషం. ఆయన వద్ద శిక్షణ పొందిన వందకు పైగా యువకులలో లయగతులు (స్టెప్స్) వేయడంలో సుమారుగా 65 మంది మాత్రమే సఫలమయ్యారు. అనంతరకాలంలో కనకరాజు, వారి ప్రశిష్యులు గుస్సాడీ నృత్యాన్ని ఎంతోమందికి నేర్పించి, ఆ కళను పరిరక్షించారు.

**నాలుగు దశాబ్దాల క్రితమే కనకరాజు ప్రతిభ దేశానికి తెలిసింది. ఆయన పేరు దేశవ్యాప్తంగా మార్మోగింది. 1982లో ఢిల్లీలోని ఎర్రకోటలో జరిగిన గణతంత్ర దినోత్సవాల్లో కనకరాజు గుస్సాడీ నృత్యాన్ని ప్రదర్శించడం విశేషం. ఆయన నృత్యాన్ని చూసి అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ మంత్రముగ్ధులయ్యారు. తాను కూడా గుస్సాడీ నృత్య ప్రదర్శన చేస్తానని ఇందిరాగాంధీ ఉత్సాహం చూపగా వెంటనే తన కాళ్ల గజ్జెలను కనకరాజు ఆమెకు ఇచ్చారు. కనకరాజు బృందంతో పాటు ఆమె కూడా ఆనందోత్సాహాలతో నర్తించారు. ఆ అరుదైన సంఘటనను కనకరాజు తన తుది శ్వాస వరకు మననం చేసుకుంటూనే ఉండేవారు. 2002లో అప్పటి రాష్ట్రపతి అబ్దుల్ కలాం సమక్షంలో కనకరాజు గుస్సాడీ నృత్యాన్ని ప్రదర్శించి ప్రశంసలందుకున్నారు.**

గుస్సాడీ నృత్యానికి కనకరాజు చేసిన సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది. 2021 నవంబర్ 9న ఢిల్లీలో నాటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతులమీదుగా ఆయన పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ నేపథ్యంలో అప్పటి రాష్ట్ర గవర్నర్ తమిళిసై, గిరిజన సంక్షేమ, సాంస్కృతిక శాఖల మంత్రులు, పలు సంస్థలు ఆయనను సన్మానించాయి. కేసీఆర్ ప్రభుత్వం రూ.కోటి విలువ చేసే భూమి, ఇల్లు, వాహనం ఇచ్చి సత్కరించింది. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరులో ఉన్న ఐటీడీఏలో పద్మశ్రీ కనకరాజు నృత్యాలయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసింది. కనకరాజు మార్గదర్శనంలో వందలాది మంది గిరిజన విద్యార్థులకు గుస్సాడీ నృత్యంలో కేసీఆర్ సర్కార్ శిక్షణ ఇప్పించింది. అలా కళను బతికించి, భావితరాలకు అందించేందుకు కనకరాజుతో కలిసి నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎంతగానో కృషిచేసింది.

కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం మర్లవాయి గ్రామంలో జన్మించిన కనకరాజు తెలంగాణ గర్వించే స్థాయికి ఎదిగారు. కనకరాజుకు నలుగురు కుమారులు, తొమ్మిది మంది కుమార్తెలు. తండ్రి కళా వారసత్వాన్ని ఆయన రెండో కుమారుడు సుదర్శన్ కొనసాగిస్తుండటం ముదావహం. అయితే, గత కొంతకాలంగా ముదిమి వయసులో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న కనకరాజు గుస్సాడీ ఉత్సవాలు జరిగే దీపావళికి ముందే ఈ లోకాన్ని వీడటం బాధాకరం. ఆయన మృతి ఆదివాసీ కళాలోకానికి తీరని లోటు. దశాబ్దాల తరబడి వ్యయప్రయాసలకోర్చి కనకరాజు పరిరక్షించిన గుస్సాడీ నృత్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా భవిష్యత్తు తరాల కోసం కాపాడుకోవాల్సిన అవసరం ఉన్నది. ఆ దిశగా అడుగులు పడాలని ఆశిద్దాం.




డాక్టర్ ద్యావనపల్లి సత్యనారాయణ
94909 57078

# మేధావులు ఇంత దివాంధులా?

**దివాంధులైన మేధావులని అంటున్నప్పుడు వారెవరైనదీ ప్రత్యేకంగా పేర్లు రాయనక్కరలేదు. వారి పేర్లు తెలంగాణ ప్రజలకు ఇప్పటికే తెలిసిపోయాయి. నల్లనివాడు కమల నయనంబుల వాడు అన్నట్లుగానన్నమాట. ఇప్పుడు సూటిగా విషయంలోకి వద్దాం. ప్రపంచ ప్రసిద్ధమైన జర్నల్ 'ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ' (ఈపీడబ్ల్యూ) ఇటీవల దేశంలోని వివిధ రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులపై, అభివృద్ధిపై ఒక పరిశోధనా కథనాన్ని ప్రచురించింది. దానిని ఈ మేధావులు తప్పక చూసే ఉంటారు. అది వారికి ఆరాధనీయమైన జర్నల్ గనుక చూడకపోయే అవకాశమే లేదు. అందులో తమ వ్యాసాలు వస్తే ఎంతో గొప్ప అని వారు తహతహలాడుతుంటారు కూడా. అటువంటి జర్నల్‌లో, కేసీఆర్ నాయకత్వాన తెలంగాణ అభివృద్ధి గురించి ఏమని రాశారు? వీరు ఆ ప్రభుత్వంపై కక్ష గట్టి, నిరంతరం దుమ్మెత్తి పోసినట్టుగానా, లేక అందుకు భిన్నంగానా?**



టంకశాల అశోక్



వాస్తవానికి అప్పటి ప్రభుత్వపు అభివృద్ధి విజయాలు, ఆర్థిక విజయాలు, సంక్షేమ విజయాల గురించి ప్రభుత్వం స్వయంగా చెప్పుకున్న వాటిని స్వోత్కర్ష అంటూ తోసిపుచ్చుజూసినా, తరచుగా ఎన్నెన్నో కేంద్ర ప్రభుత్వ శాఖలు, సంస్థలు, స్వతంత్ర సంస్థలు, ఈ దివాంధ మేధావులే మెచ్చే జాతీయస్థాయి నిపుణులు, మరొక వైపు అంతర్జాతీయ సంస్థలు, దేశీయ, అంతర్దేశీయ పారిశ్రామిక సంస్థలు గుర్తిస్తూనే ఉండటం తెలియనిది కాదు. కండ్లు తెరిచి ఓపెన్ మైండ్‌తో ఉంటే ఇక్కడి మేధావులు కూడా చూడగలదే. దేశంలోని వెనుకబడిన ప్రాంతాలలో ఒకటిగా పేరుబడిన తెలంగాణ ప్రాంతం, ఉమ్మడి రాష్ట్రపు ఘనమైన పరిపాలనకు దూరమైతే ఏమైపోగలదోనని ఘనత వహించిన ఆర్థిక శాస్త్రవేత్త అయిన అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్‌తో సహా తెలంగాణ 'శ్రేయోభిలాషులు' పలువురు చింతాక్రాంతులు కావటం తెలిసిందే. ఉమ్మడి పాలక మహాశయులైతే గుడ్లురుముతూ ఎన్నెన్నో భయాలు పెట్టారు. ఆ తరహా మాటలను, ప్రచారాలను జాతీయంగా, అంతర్జాతీయంగా ఎందరో నమ్మారు కూడా.

కానీ, ఆచరణలో అందుకు పూర్తి విరుద్ధంగా జరుగుతుండటం, వివిధ రంగాలలో అభివృద్ధి అంతా కండ్ల ఎదుటనే కనిపిస్తుండటంతో అదే మన్మోహన్‌సింగ్‌తో సహా అందరూ నిరుత్తరులు కావటమో, ప్రశంసించటమో చూశాము. ఆయా గణాంకాలు, గ్రాఫ్‌లు ఉమ్మడి రాష్ట్ర కాలంతో, దేశంలోని ఇతర రాష్ట్రాలతో, 2000వ సంవత్సరంలో కొత్తగా ఏర్పడిన రాష్ట్రాలతో పోలికలూ అందుకు భిన్నంగా మాట్లాడలేని పరిస్థితిని సృష్టించాయి. అయితే ఇదంతా కండ్లూ, చెవులూ తెరుచుకొని ఉండిన ఇతరుల మాట. గమనార్హమైన విషయమేమంటే, ఆ ఇతరులలో తెలంగాణను నానా విధాలుగా శపించిన సీమాంధ్ర పాలకవర్గాలు, మేధావి వర్గాలు, కమ్యూనిస్టు కామ్రేడ్ మహాశయులు సైతం ఉన్నారు. వారు ఒకవేళ పైకి మాట్లాడకున్నా మనసులో గుర్తించారు. ఆ ప్రాంతపు సామాన్య ప్రజల సంగతి వేరు. వారు తెలంగాణ విడిపోతే ఎట్లా అని రకరకాల భయాలు పెట్టుకున్నారు గానీ ఈ ప్రాంతాన్ని ద్వేషించటం గాని, దీనిని కబళించటం ఎట్లాగా అని కుయుక్తులు పన్నటం గాని చేయలేదు. తెలంగాణ తాము ఊహించని రీతిలో అభివృద్ధి చెందుతుండటం చూసి మెచ్చుకున్నారు, సంతోషించారు. తాము తెలంగాణకు వచ్చివేయాలని, లేదా తమ రాష్ట్రం కూడా తెలంగాణ వలె అభివృద్ధి చెందాలని ఆలోచనలు చేశారు.

**బీఆర్‌ఎస్ పాలనలో తప్పులు ఎన్నలేమని కాదు. మేధావులు మంచి చెడులు రెండింటినీ మాట్లాడాలి. వారి దృష్టి సమాజ శ్రేయస్సు, తెలంగాణ అభివృద్ధి కావాలి గనుక. కానీ, పదేండ్లలో ఎన్నడూ, ఏ విషయంలోనూ వారట్లా వ్యవహరించలేదు. బీఆర్‌ఎస్‌పై, కేసీఆర్‌పై కక్షగట్టి దివాంధులుగా మారారు.**

ఊరంతా ఒక దారైతే ఉలిపి కట్టెది మరో దారి అన్నట్లు వికారమైన రీతిలో ప్రవర్తించింది ఎవరు? సమాధానం తిరిగి అదే. ఇప్పుడు ఈపీడబ్ల్యూ వ్యాసానికి ఈ మేధావి బృందాల స్పందన ఏమిటో తెలియదు. అక్టోబర్ 19వ తేదీతో వెలువడిన ఆ వ్యాస రచయితలు గోవింద్ భట్టాచార్జీ, మేఘనా అగర్వాల్ తక్కువ స్థాయి వారేమీ కాదు. భట్టాచార్జీ కాగ్ మాజీ డైరెక్టర్ జనరల్. ప్రస్తుతం ఫరీదాబాద్‌లోని అరుణ్‌జైట్లీ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్‌లో పనిచేస్తున్నారు. మేఘనా అగర్వాల్ కూడా అక్కడే. కనుక వారినెవరూ బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి అనుకూలంగా కావాలని రాశారనలేరు. పైగా వారి రచన అన్ని రాష్ట్రాల గురించిన విశ్లేషణ. అందులో భాగంగా తెలంగాణ విశేషాలు తేటతెల్లమయ్యాయి.

ఆ విశేషాలు ఏమిటో ముందు క్లుప్తంగా చూద్దాము. ఆ వ్యాసం శీర్షిక 'ఏన్ ఇండెక్స్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్‌బై ఇండియన్ స్టేట్స్'. అందులో పేర్కొన్న దాని ప్రకారం, రుణ నిర్వహణలో దేశంలో ఒడిశాది మొదటిస్థానం కాగా, తెలంగాణ రెండవ స్థానంలో నిలిచింది. వనరుల నిర్వహణలో గోవా, తెలంగాణలవి మొదటి రెండు స్థానాలు. తెలంగాణది వ్యయ నిర్వహణ సూచీలో 13వ స్థానం, సబ్సిడీల కోసం వ్యయంలో 5 కాగా, ఓవరాల్ ర్యాంక్ 9. ఈ విశ్లేషణ కోసం దేశంలోని 28 రాష్ట్రాలను 18 జనరల్ రాష్ట్రాలుగా, 10 ప్రత్యేక కేటగిరీ రాష్ట్రాలుగా వర్గీకరించారు. జనరల్ రాష్ట్రాలలో మహారాష్ట్ర, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, గుజరాత్, తమిళనాడు, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, కేరళ, హర్యానా, పశ్చిమబెంగాల్, పంజాబ్, మధ్యప్రదేశ్, బీహార్ వంటివాటిని మించిపోయి తెలంగాణ ఈ ర్యాంకులను సాధించింది.

**నిజానికి బీఆర్‌ఎస్ పాలనలో తెలంగాణ కొత్త రాష్ట్రం అయినప్పటికీ ఈ విధంగా ఆర్థిక పరిపుష్టిని పొందినట్లు ఈపీడబ్ల్యూ వ్యాసానికి ముందుకాలంలోనూ కాగ్‌తో పాటు రిజర్వ్ బ్యాంక్, ప్రధానమంత్రి ఆర్థిక సలహామండలి పేర్కొన్నాయి. అదంతా ఆయా సమయాలలో వార్తలలో వెలువడినటువంటిదే. అయినప్పటికీ అప్పులు అప్పులంటూ, అభివృద్ధి శూన్యమంటూ 365 రోజులూ కాంగ్రెస్, బీజేపీ, కమ్యూనిస్టులు ప్రచారాలు చేయటం షరామామూలు రాజకీయమని అర్థం చేసుకోవచ్చు. కానీ, మేధావులనబడే వారు కూడా అదే పని చేయటాన్ని ఎట్లా పరిగణించాలి?**

బీఆర్‌ఎస్ పాలనలో తప్పులు ఎన్నలేమని కాదు. మేధావులు మంచి చెడులు రెండింటినీ మాట్లాడాలి. వారి దృష్టి సమాజ శ్రేయస్సు, తెలంగాణ అభివృద్ధి కావాలి గనుక. కానీ, పదేండ్లలో ఎన్నడూ, ఏ విషయంలోనూ వారట్లా వ్యవహరించలేదు. బీఆర్‌ఎస్‌పై, కేసీఆర్‌పై కక్షగట్టి దివాంధులుగా మారారు. అప్పటి పాలనలో ఒక్కటంటే ఒక్క మంచి అయినా వారికి కనిపించలేదు. రాత్రింబవళ్లు చెడు-చెడు అన్నదే వారి ప్రచారమైపోయింది. చివరికి గత ఎన్నికలలో కాంగ్రెస్ ప్రచార రథాలకు జెండాలూపే స్థాయికి పతనమయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు అనేక దశాబ్దాల పాటు తెలంగాణను ఎట్లా దోపిడీ చేశాయో, ఎట్లా సీమాంధ్ర ధనిక వర్గాలకు తాకట్టు పెట్టాయో, తెలంగాణ ప్రజల వివిధ ఉద్యమాలను ఏ విధంగా అణచివేశాయో, నక్సలైట్ల పేరిట వేలాది మంది యువతీ యువకులను, ఇతర తరగతుల ప్రజలను ఎట్లా కాల్చి చంపాయో అన్నీ మరిచిపోయి మరీ జెండాలు ఊపారు. సీమాంధ్ర ధనిక, పాలకవర్గాల మోచేతి నీళ్లను దశాబ్దాల పాటు తాగి తెలంగాణను దగా చేసిన వారికి బానిసకొక బానిస అన్నట్లు మారారు.

తిరిగి ఇప్పుడు చేస్తున్నదేమిటి? కాంగ్రెస్ పాలనలో కండ్ల ఎదుట ఇన్నిన్ని వైఫల్యాలు, అన్యాయాలు, అణచివేతలు జరుగుతున్నా కిక్కురుమనరు. ఎక్కడైనా ప్రశ్నలు ఎదురైతే నేల చూపులు చూస్తారు. నూటొక్క సాకులు వెతుకుతారు. ఈ విధమైన నిన్నటి ప్రవర్తనను, ప్రస్తుత ప్రవర్తనను గమనించినపుడు, వీరిని ఈ రెండు ధోరణులలోనూ ఏవో స్వప్రయోజనాలు ఆశించినవారని ఎందుకు భావించకూడదు? దివాంధులని ఎందుకు పిలవరాదు? ఒకవిధంగా అది కూడా సరికాదు. ఎందుకంటే, గుడ్లగూబలకు దివాంధత్వం ప్రకృతిలో సహజమైన రీతిలో కలిగినటువంటిది. కానీ ఈ మేధావులు దివాంధత్వం వారు స్వప్రయోజనాలతో పాటు, మనకు తెలియని మరేవో కారణాలతో కావాలని తెచ్చి పెట్టుకున్నటువంటిది. అది ప్రస్తుతం చాలా స్పష్టంగా కనిపిస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వ హామీల అమలు వైఫల్యంలో, సమస్యల పరిష్కార వైఫల్యంలో, వివిధ వర్గాల ప్రజల నిరసనల అణచివేతలో, నిరంతరం అబద్ధాలూ బుకాయింపులతో విషయాలను దాటవేయటంలో కనిపిస్తున్నది. అయినప్పటికీ దివాంధ మేధావులు తమ గాఢ నిద్రలను నటిస్తూనే ఉన్నారు. ఒక కమ్యూనిస్టు పార్టీ తమకు భిక్షగా లభించిన ఒక్క సీటుతో ఇంకా పరవశిస్తూనే ఉన్నది. మరొక కమ్యూనిస్టు పార్టీ అర్ధమనస్కపు కలవరింతలలో ఉన్నది. చివరగా మరొకసారి ఈ మేధావి మహాశయుల గురించి చెప్పుకోవాలంటే, వారు తాము నివసించే నగరాలలో గాని, గ్రామాలలో గాని ప్రజలను కలవక, ఓపెన్‌మైండ్‌తో మాట్లాడక, ఉష్ట్ర పక్షి జీవితాలలో ఆనందం పొందుతున్నారు.